32

# నిజాయితీ

చాలా రోజుల తరువాత దోసపండు తలవని తలంపుగా నాకు బజారులో కనిపించాడు. వాడు కాలేజీలో చదివే రోజుల్లో నా క్లాస్‌మేట్. వాడి ముఖం దోసకాయలా ఉంటుందనివాడిని మేమందరం ముద్దుగా "దోసపండూ" అని పిలుచుకునేవాళ్ళం. కొన్నాళ్ళకి వాడి అసలు పేరేమిటో మేమందరం మర్చిపోయాం.

"ఏమ్మిత్రోయ్... ఎటెళ్తున్నావ్"?... అని అడిగాడు దోసపండు నా భుజంమీద చెయ్యేస్తూ.

"ఇంటిలో ఏమీ తోచడంలేదు...మా ఆవిడ పుట్టింటికి వెళ్ళింది...అలా షికారెళదామని..." అన్నాను.

"నాకూ తోచకే ఇలా బయలుదేరాను...పద ఏదైనా సినిమాకి వెళదాం..." అన్నాడు దోసపండు

"అయితేపద... 'ఎ' సర్టిఫికేటున్న మాంచి ఇంగ్లీషు సినిమా సంగీత్‌లో ఆడుతుంది..." అన్నాను.

దోసపండు పడీపడీ నవ్వాడు. తరువాత క్రిందనుండి లేచి బట్టలకంటుకున్న మట్టి దులుపుకున్నాడు.

నువ్వు మరీ ఇంత అమాయకుడి వనుకోలేదోయ్... 'ఎ' సర్టిఫికేటున్న ఇంగ్లీషు సినిమాకంటే 'యు' సర్టిఫికేటున్న

తెలుగు సినిమాలోనే సెక్సెక్కువుంటుంది. తెల్గు సినిమాకే వెళదాం. తెలుగు సెన్సార్ బోర్డుకి జై..." అంటూ నన్ను బస్సుస్టాపుకి లాక్కెళ్ళాడు.

బస్సువచ్చి ఆగింది. ఇద్దరం అడ్డొచ్చిన వెధవల్ని కుమ్మేస్తూ బస్సెక్కి వెనకసీటులో కూర్చున్నాం.

బస్సుకదిలి పదినిముషాలైంది. దోసపండు ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ మధ్యమధ్య మెడసాగదీసిపైకెత్తి ముందుకుచూస్తున్నాడు. అలా అప్పటికే ఒక డజనుసార్లు చూశాడు. నాకు అనుమానం వచ్చింది. నేను కూడా మెడని సాగదీసి ముందుకుచూశాను. అమ్మాయిలనబడే వాళ్ళెవరూ నాకు కనిపించలేదు.

"ఎందుకలా మాటిమాటికీ ముందుకుచూస్తున్నావ్?" అని అడిగాను చివరికి కుతూహలం పట్టలేక.

"టిక్కెట్లు ఇవ్వడానికి కండక్టరు రాలేదేమిటా అని..."

"పరవాలేదులే...మన తప్పేమీ లేదుగా...డ్యూటీ సరిగ్గా చెయ్యకపోవడం కండక్టరు తప్పు..." అన్నాను.

"వాడు డ్యూటీ సరిగ్గా చెయ్యకపోతేపోనీ ... మన బాధ్యతకూడా ఉందిగా...మనం టికెట్లు తీసుకోకుండా బస్సు దిగితే మన నిజాయితీ ఏమున్నట్టు?... మనిషికి నిజాయితీ ఉండాలి....అప్పుడే..............."

అలా నిజాయితీ గురించి వాడు నాకు ఓ అయిదు నిముషాలు లెక్చరిచ్చాడు.

మేము దిగాల్సిన స్టాపు వచ్చేసింది.

"త్వరగా దిగు...బస్సు కదిలి పోతుంది" అన్నాను.

"ఉహు. టిక్కెట్టు తీసుకోవాల్సిందే"

దోసపండు జనాన్ని చీల్చుకుంటూ డ్రైవరుతో కబుర్లు చెప్తున్న కండక్టరువైపు వెళ్ళాడు. నేను వెనుకగేటునుండి బస్సుదిగాను. కండక్టరు దగ్గర టిక్కెట్లు తీసుకున్న దోసపండు ముందుగేటులోంచి బస్సుదిగాడు.

దోసపండు హుషారుగా ఈల వేసుకుంటూ నావైపు వచ్చాడు. "నేను అయిదు రూపాయలిచ్చి టిక్కెట్లు తీసుకుంటే కండక్టరు పొరబాట్న పదిరూపాయలకి చిల్లరఇచ్చాడు. చూశావా నేను నిజాయితీగా టిక్కెట్లు తీసుకోబట్టే కదా నాకులాభం కలిగింది. నిజాయితీపరులకు దేవుడి అండదండ లెప్పుడూ ఉంటాయ్..." అన్నాడు దోసపండు.

*     *     *     *

నీతి:- దేవుడికి నిజాయితీ పరులంటే చాలా యిష్టం.

ఆంధ్రభూమి.